క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలకు 186 మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు శుక్రవారం 186 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారని ఇంటర్ విద్యాధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు. 4,355 మంది విద్యార్థులకు 4,169 మంది పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు. తరిగొప్పులకు చెందిన విద్యార్థిని చింతల వైష్ణవి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సెంటర్‌కు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించలేదు. బస్సు ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయలేక పోయానని వైష్ణవి వాపోయింది.

పరీక్ష సామగ్రి పంపిణీ



జఫర్‌గఢ్: మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి రాజిరెడ్డి పరీక్ష సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయాలని అన్నారు. ఉపాధ్యాయులు పసునూరి కవిత, కడారి వసంత, గాదె వెంకటస్వామి, వెంగల జితేందర్, దామెర ఉపేందర్, వనజాత, మంజుల, వంశీకృష్ణ, మాధవి, ప్రశాంత, విద్యార్థులు పాల్గొన్నారు.

మైక్ సెట్, వాటర్ ఫిల్టర్ అందజేత



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు పింగిలి రమాదేవి విశేషారెడ్డి రూ.30 వేల విలువైన మైక్ సెట్, వాటర్ ఫిల్టర్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వాటిని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ పాఠశాలకు పలు సౌకర్యాలు ఉపాధ్యాయులు కల్పించడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎం ఉమారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమాదేవి, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



నర్మెట: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, బడుగు బలహీన వర్గాలకు చేయూత లభించింది కాంగ్రెస్ పాలనలోనేనని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 50 లక్షలతో మండలంలోని గుంటూర్‌పల్లి, వెల్దండ, గండిరామారం, మల్కపేట, ఆగపేట, సూర్యబండతండ, ఇప్పలగడ్డ, మాన్‌సింగ్‌తండా, డీసీ తండ, ఇసుకబాయితండాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఆయన పూజలు నిర్వహించి మాట్లాడారు. ఫరీదుల యాదయ్య, గొల్లపల్లి కుమారస్వామి, రాజబోయిన లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సాధికారత సాధించాలి

● ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం అధికారి స్వర్ణకుమారి

బచ్చన్నపేట/లింగాలఘణపురం/జనగామ రూరల్/చిల్పూరు/తరిగొప్పుల: నేటి సమాజంలో మహిళలు సాధికారత సాధించినప్పుడే అన్ని రంగాల్లో రాణించినట్లు అవుతుందని ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం జిల్లా అధికారి స్వర్ణకుమారి అన్నారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బచ్చన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడిన అనంతరం వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్‌గౌడ్, ఆస్పత్రి సూపరెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే లింగాలఘణపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ డాక్టర్లు, ఏఎన్‌ఎం, ఆశలను సన్మానించారు. కాగా, డీసీసీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర ఆధ్వర్యంలో, పలు పాఠశాలల్లో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులను, టీచర్లను సన్మానించారు.



బచ్చన్నపేట: మాట్లాడుతున్న జిల్లా అధికారి స్వర్ణకుమారి

ఆదర్శ మహిళలను స్ఫూర్తిగా తీసుకోవాలి : బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి

జనగామ: ప్రపంచంలో అనేక మార్పులకు శ్రీకారం చుడుతూ ఆదర్శంగా నిలిచిన మహిళలను స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో రాణించాలని బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి పిలుపునిచ్చారు. జనగామ మండలం యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముందస్తు మహిళా దినోత్సవ వేడకల్లో ఆమె మాట్లాడారు. నేటి విద్యార్థినులకు బాధ్యతాయుత పరిజ్ఞానం అవసరమని, వారి శక్తిని జీవితంలో రాణించేలా మలుచుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థినీ విద్యార్థుల్లో నైపుణ్యతను పెంచేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని చెప్పారు. జనగామ కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప మాట్లాడుతూ మహిళలు లక్ష్యాన్ని ఎంచుకుని అందుకు అనుగుణంగా ముందుకుసాగుతూ.. పురుషులతో సమానంగా తమదైన ముద్రను సమాజానికి చూపించాలని కోరారు. అనంతరం అతిథులతో పాటు పలువురు మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.



జనగామ: క్రీస్తుజ్యోతి కళాశాల విద్యార్థినులతో బాలలక్ష్మి

వ్యవసాయంలో 'రాణి'ంపు



పత్తిచేలో పనులు చేస్తున్న తుమ్మ రాణి

దేవరుప్పుల: ఆరు పదులు దాటినా అలుపెరగకుండా వ్యవసాయం చేస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు తుమ్మ రాణి. దేవరుప్పుల మండలం కడవెండికి చెందిన దావిద్‌రెడ్డి పన్నెండేళ్ల కిందట అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ భారం ఆయన భార్య రాణిపై పడింది. అప్పటికే వ్యవసాయంలో భర్తకు తోడుగా వెళ్లే క్రమంలో నేర్చుకుంది. వ్యవసాయ భూమిలో పత్తి వంటి వాణిజ్య పంటల సాగులో మెళకువలు సాధించింది. పన్నెండేళ్లుగా వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని మోస్తోంది. ఇద్దరి కుమార్తెల వివాహం చేసింది. వయస్సు ఆరు పదులు దాటినా వ్యవసాయాన్ని మాత్రం ఆపలేదు.

సాధించాల్సింది చాలా ఉంది..

● డీపీఓ స్వరూప

నర్మెట: మహిళలు సాధించాల్సింది చాలా ఉంది.. మరింత పురోగమించాల్సిన అవసరముందని జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూప అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎంఆర్సీ భవనణ ప్రాంగణంలో ఎంఈఓ ఐలయ్య అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. ఆకాశంలో సగమైన మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. పాశ్చాత్యదేశాలతో పోల్చుకుంటే మనం సాధించాల్సింది చాల ఉందని తెలిపా. సమాజంలో వివక్ష పూర్తిగా తొలగిపోలేదు నిత్యం ఏదో ఒకచోట మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. గ్రామాల్లోని మహిళలు సాధికారత సాధించాలని అన్నారు. అన్నింటికీ మూలం విద్య అని, తల్లి తండ్రులు ఆడపిల్లను చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడల్లోని విజేతలకు ఆమె బహుమతులను ప్రదానం చేశారు. ఎంపీడీఓ అరవింద్ చౌదరి , ఎంఈఓలు జానకి, కళావతి, కాంప్లెక్స్ హెచ్‌ఎం కమల, డాక్టర్ ప్రీతి దయాల్, ఆయా శాఖల మహిళా ఉద్యోగులు, ఎమ్మార్సీ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఓ స్వరూప

'ఒలింపియాడ్'లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంస పత్రం అందజేస్తున్న మరియా జోసఫ్

జనగామ: పట్టణంలోని నెహ్రూపార్కు ఏరియా సెయింట్ పాల్స్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఇండియన బ్రిలియంట్ ఒలింపియాడ్ పరీక్షల్లో అదే పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. 8వ తరగతి విద్యార్థి బి.వర్షిత్ మ్యాథ్స్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. హెచ్‌ఎం మరియా జోసఫ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని మరిన్ని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తములకు ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు.

ఇష్టపడి చదవాలి

బచ్చన్నపేట : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి.. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుంటేనే జీవితంలో స్థిరపడతారని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పెళ్లి బరాత్‌లోకి దూసుకొచ్చిన కారు

● కొండాపూర్‌కు చెందిన మహిళ మృతి



ఉమ(ఫైల్)

చిల్పూరు: చుట్టాల పెళ్లి బరాత్ చూస్తుండగా వధూవరులు కూర్చున్న కారు దూసుకు రావడంతో చిల్పూరు మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మహిళ మృతి చెందింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో గురువారం జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్ గ్రామానికి చెందిన లొడెం యాదగిరి కూతరు ఉమ(35) వివాహం మెట్‌పల్లికి చెందిన బాసారపు పరశురాములుతో 20 ఏళ్ల క్రితం జరిగింది. గురువారం గ్రామంలో బంధువుల పెళ్లికి ఉమ తన కూతురు నిఖితతో కలిసి వెళ్లింది. ఈ క్రమంలో బరాత్‌లో వధూవరులు కూర్చున్న కారు ఒక్కసారిగా దూసుకు రావడంతో ఉమ తీవ్రంగా గాయపడగా.. ఆమె కూతురు చేయి విరిగింది. వారిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా శుక్రవారం ఉమ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా భువనగిరి సమీపాన మృతి చెందింది. మెట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేయగా శనివారం స్వగ్రామంలో దహన సంస్కారాలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చాకలి ఐలమ్మ మనుమడి మృతి

● రామచంద్రానికి కన్నీటి వీడ్కోలు
● 20 సంవత్సరాలు సర్పంచ్‌గా సేవలు
● పలువురు ప్రముఖుల సంతాపం



రామచంద్రం(ఫైల్)

పాలకుర్తి టౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనుమడు పాలకుర్తి మాజీ సర్పంచ్ చిట్యాల రామచంద్రం (73) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఆయన రాజకీయ ప్రస్థానం సీపీఐలో ప్రారంభమైంది. 1981 నుంచి 2001 వరకు వరుసగా మూడ పర్యాయాలు సీపీఎం నుంచి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న రామచంద్రం పాలకుర్తి గ్రామ అభివృద్ధిలో కీలకంగా వ్యహరించారు. 2001 నుంచి టీడీపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలో పని చేశారు.

ప్రభుత్వం తరపున రూ.10వేల ఆర్థిక సాయం

రామచంద్రం అంత్యక్రియలకు ప్రభుత్వం తరపున కలెక్టర్ రిజ్వాన్ బాషా అదేశాల మేరకు అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అతడి కుటుంబ సభులను పరామర్శించి రూ.10 వేల సాయం అందజేశారు.



రామచంద్రం కుమారుడు సంపత్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

పలువురి పరామర్శ..

రామచంద్రం మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతోపాటు స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్.. అతడి కుమారుడు సంపత్, శ్వేత దంపతులను ఫోన్‌లో పరామర్శించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి తదితరులు రామచంద్రం మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజు సాంబయ్య, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, కాంత్రిదళ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్, ప్రముఖ కవులు సంతాపం తెలియజేశారు.

రుచికరమైన భోజనం అందించాలి

● అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

పాలకుర్తి టౌన్: విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని అదనపు కలెకర్ పింకేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం వసతుల కల్పనను పర్యవేక్షించారు. పాఠశాల అవరణంలో పరిశుభ్రంగా ఉంచాలని, నీటి వృథాను అరికట్టాలన్నారు. వంటగదిని సందర్శించి పరిశీలించారు. గురుకుల పాఠశాలలో మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ వెంకన్న, ప్రిన్సిపాల్ స్వరూప, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, ఆర్ఐ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ప్రభుత్వ విప్ ఐలయ్య

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని, అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం ఆయన యాదాద్రిభువనగిరి జిల్లా రాజపేట మండలానికి వెళ్తూ మండల కేంద్రంలో ఆగి రాజస్థాన్ హోటల్‌లో ఛాయ్ తాగి పలువురు రైతులు, నాయకులతో ముచ్చటించారు. యాదగిరి గుట్ట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాలరాజుగౌడ్, నాయకులు బొట్టు సుధాకర్, రాంమోహన్‌రెడ్డి , రైతులు పాల్గొన్నారు.

'జనగామ'ను పాపన్న జిల్లాగా మార్చాలి



కొడకండ్ల: నారాయణగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొడకండ్ల/పాలకుర్తి: జనగామ జిల్లాను సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా పేరు మార్చాలని గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్‌లు కోరారు. శుక్రవారం కొడకండ్ల, పాలకుర్తి మండలకేంద్రాల్లో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 350 సంవత్సరాల క్రితమే బడుగుల అభ్యున్నతి కోసం సామాజిక న్యాయం కోసం కృషి చేసిన గొప్ప పోరాట యోధుడు పాపన్న అని అన్నారు. జిల్లాకు పాపన్న పేరు పెట్టాలనే డిమాండ్‌తో ఈ నెల 21న జిల్లా కలెక్టరేట్ వద్ద తలపెట్టిన దీక్షకు కులమతాలకు అతీతంగా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు రూ.5వేల కోట్లు కేటాయించాలి

● కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ

జనగామ రూరల్: గౌడ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికులకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వృత్తిలో ప్రమాదానికి గురైన వారికి ఏడాది నుంచి ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని, నీరా కేఫ్‌ను టాడీ కార్పొరేషన్‌కు అప్పగించాలని డిమాండ్ చేశారు. ట్యాంక్ బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని కోరారు. కాటమయ్య రక్షణ కవచం జిల్లాలో ఇప్పటివరకు 680 మందికి మాత్రమే ఇచ్చారని, మిగతా 10,500 మంది వృత్తిదారులకు వెంటనే అందజేయాలన్నారు. గౌడ ఆత్మగౌరవ భవన నిర్మాణంపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని, త్వరగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి, జిల్లా కమిటీ సభ్యులు వడ్లకొండ వెంకటేష్, పరిధిల భాస్కర్, మార్క ఉపేందర్, బాలే రాజయ్య, కుర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ

స్థానిక సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: గ్రామాల్లో, పట్టణంలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇర్రి అహల్య శేఖర్, గోపి, ప్రకాష్, విజేందర్, ఉపేందర్, ఎండీ అజార్ ,ఎండీ షబానా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్బాస్

సాయికిరణ్‌కు ఇండియన్ లెగసీ అవార్డు



దేవరుప్పుల: సింగరాజుపల్లికి చెందిన కొమ్ము సాయికిరణ్‌కు విపత్కర పరిస్థితుల్లో విస్తృత సేవలందించినందుకుగానూ వెల్రెడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఆ సంస్థ ఇండియన్ లెగసీ అవార్డు అందజేసింది. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలం 600 నిరుపేద కుటుంబాలకు బియ్యం సరుకులు అందజేయడం, అలాగే బీబీనగర్‌లోని ఓ కంపెనీలో పనిచేసే 9 మంది వలస కార్మికులకు సరుకులను అందజేసి తన సొంత ఖర్చుతో బెంగాల్‌కి పంపించడం జరిగిందన్నారు. ఇలాంటి సమాజహిత సేవలను గుర్తించి పురస్కారం ఇవ్వడం పట్ల ఫౌండేషన్ డైరెక్టర్లు రస్బీహరి కేయేట్, శ్రాభాని కేయేట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

నర్మెట/దేవరుప్పుల: మూడు స్థానాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించగా రెండింటిలో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ శ్రేణులు నర్మెట, దేవరుప్పుల మండల కేంద్రాల్లో శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యాభివృద్ధికి పాటుపడండి

దేవరుప్పుల: బాలికల విద్యాభివృద్ధికి నిర్వాహకులు, ఉపాధ్యాయ బృందం పాటుపడాలని తహసీల్దార్ ఎం మహిపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గిరిజన విద్యాలయంను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎన్నిక

చిల్పూరు: కాంగ్రెస్ పార్టీ కొండాపూర్ గ్రామ శాఖ యూత్ అధ్యక్షుడిగా బండారి వేణు ఎన్నికయ్యారు. శుక్రవారం గ్రామంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు

సంక్షిప్త సమాచారం

గ్రామ శాఖ యూత్ కమిటీ అధ్యక్షుడిగా వేణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరంచిన మండల అధ్యక్షుడు సురేశ్, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, మాజీ ఎంపీపీ సరిత బాలరాజు, మామిడాల లింగారెడ్డి, మారబోయిన ఎల్లయ్య తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

'హామీలు నెరవేర్చాకే సీఎం పర్యటించాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాకే సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి రావాలని, లేని పక్షంలో అడ్డుకుంటామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక నేటికి ఒక్క హామీ నెరవేర్చని సీఎం ఎందుకు వస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలను అముల చేయకుండా ఈనెల 16వ తేదీన వస్తే అడ్డుకుంటామన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

కొడకండ్ల: బీఆర్‌ఎస్ కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం గిర్నితండాలో మృతి చెందిన ధరావత్ లక్ష్మి మృతదేహనికి నివాళులర్పించి కుటుంబసభ్యులను దయాకర్‌రావు పరామర్శించారు. అలాగే ప్రమాదంలో గాయపడి చికిత్స పొందిన మొండ్రాయి గ్రామానికి చెందిన దౌపాటి ఎల్లయ్యను దయాకర్‌రావు పరామర్శించారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

చిల్పూరు/లింగాలఘణపురం/జఫర్‌గఢ్/కొడకండ్ల/నర్మెట/బచ్చన్నపేట/రఘునాథపల్లి: కొడకండ్ల, తిమ్మంపేట, మల్కపేట, బండనాగారం, చిల్పూరు, కుందారం, గబ్బెట, కోమళ్ల ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈసందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

జనగామ రూరల్/బచ్చన్నపేట/దేవరుప్పుల: గ్రామ పంచాయతీ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పలు మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఎంపీడీఓలకు అందజేశారు. ఆయా కార్యక్రమంలో జీపీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'సీఎం సభను విజయవంతం చేయాలి'

జఫర్‌గఢ్: ఈ నెల 16వ తేదీన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు ప్రతీ గ్రామం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు.

'చర్య తీసుకోవాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు ధర్మసాగర్ మండలం జానకీపురం గ్రామానికి చెందిన కుర్సపెల్లి రమేశ్ అనే వ్యక్తిని చితకబాది అధికార దుర్వినియోగానికి పాల్పడిన సీఐ, ఎస్సైలపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గాదె పృథ్వీ డిమాండ్ చేశారు. నియోజకవర్గం కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఐ ప్రవీణ్, ఎస్సై జానీపాషాలు ఎమ్మెల్యేకు ఊడిగం చేయాలనుకుంటే ఉద్యోగం మానేయాలేతప్ప అమాయకులపై ప్రతాపం చూపెట్టవద్దని అన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉన్నతాదికాధిలను కోరారు.

అశ్వరావుపల్లి విద్యార్థికి ఇన్‌స్పైర్ అవార్డు

రఘునాథపల్లి: అశ్వరావుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్లందుల వెంకటేష్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికై నట్లు హెచ్‌ఎం శోభన్‌బాబు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఇన్‌స్పైర్ అవార్డు పొందిన విద్యార్థి వెంకటేష్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

గుండెపోటుతో ఆశ కార్యకర్త మృతి

రఘునాథపల్లి: నిడిగొండ ఆశ కార్యకర్త సీహెచ్ మహేశ్వరి (54) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందింది. గురువారం మహేశ్వరికి ఇంట్లో చాతి నొప్పి రాగా కుటుంబ సభ్యులు వెంటనే జనగామ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి వరంగల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించింది. సమాచారం అందుకున్న డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు జిల్లా, మండల వైద్యులతో కలిసి నిడిగొండకు చేరుకొని భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో గేదె..

చిల్పూరు: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. ఈ ఘటన చిన్నపెండ్యాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత రైతు కొన్నె రాములు తెలిపిన వివరాల ప్రకారం... రోజు మాదిరిగా గేదె మేతకు వెళ్లి ఎల్‌టీ వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం విద్యుత్ వైరు తెగితే ట్రాన్స్‌కో అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో గేదె మృతి చెందిందన్నాడు. రూ.60వేల విలువైన గేదె మృతి చెందిందని, అధికారులు న్యాయం చేయాలని కోరాడు.

రుగ్మతలపై చైతన్యం కావాలి

దేవరుప్పుల: సమాజంలోని రుగ్మతలపై యువత చైతన్యం కావాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. గురువారం రాత్రి ధర్మాపురంలో స్థానిక ఎస్సై ఊర సృజన్ కమార్ అధ్యక్షతన జాగృతి పోలీస్ కళాబృందం పలు అంశాలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఎస్సై సృజన్‌కుమార్, జాగృతి బృందం ఇన్‌చార్జ్ నాగమణి, విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య,పూల్‌సింగ్, శ్రీనివాస్ ఉన్నారు.

Happy Women's Day
సంతానం లేని దంపతులకు ఉచిత OP & స్కానింగ్
8 March, 2025 (2pm - 7pm)
Women's Day Special
Preethi Kidney Centre
Preethi Fertility Centre & Women's Clinic
Dr. S. Preethi Dayal
అపాయింట్‌మెంట్ కొరకు: 7036600625, 8790554332
ప్రీతి కిడ్నీ సెంటర్ & జనరల్ హాస్పిటల్
డా॥ M. నిశాంత్ కుమార్
+91 7780572951
7036600625
Suryapet Road, JANGAON.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జనగామ :
9951602871
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)